


అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -337 మంగళవారం 14ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# హార్మోజ్ దిగ్బంధనం..!

## నౌకలను అడ్డుకుంటున్న అమెరికా బలగాలు

**ఇది చట్ట విరుద్ధం : ఇరాన్**

**ఇటువైపు వస్తే నాశనమే : ట్రంప్**

**సంయమనం అవసరమన్న చైనా**



**వాషింగ్టన్, టెహరాన్ ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):** పశ్చిమాసియాలో తాజా పరిణామాలు మరోసారి ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని అనిశ్చితి నెలకొంది. అమెరికా-ఇరాన్ చర్చలు విఫలం కావడం, మరోవైపు హార్మ్యూజ్‌ను ఎలాగైనా తమ అదుపులోకి తెచ్చుకుంటామని, అందుకోసం ఆ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ట్రంప్ అన్నంతపనిచేశారు. చర్చల ప్రక్రియకు ముందే హార్మ్యూజ్ జలసంధి వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న అమెరికన్ బలగాలు ట్రంప్ ఆదేశాల మేరకు దిగ్బంధనానికి దిగాయి **మిగతా 2లో...**



## భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది

**21వ శతాబ్దంలోనే అతిపెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందన్న మోదీ**

**భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు బలోపేతం చేస్తారన్న మోదీ**

**సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోందన్న మోదీ**


2లో.

## తెలంగాణలో ఈ నెల 22 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె

**మార్చి 13న సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపిన ఆర్టీసీ జేఏసీ**

**యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని వెల్లడి**

**ప్రభుత్వం, యాజమాన్యం ముందు 32 డిమాండ్లు**



# మోడీ కుట్ర దేశానికే ప్రమాదం

**హైబ్రీడ్ మోడల్ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపట్టాలి**

**33శాతం మహిళా రిజర్వేషను అమలు చేయాలి**

**నాడు బీజేపీ సహకరించకపోవడం వల్లే ఆ బిల్లు ఆమోదం పొందలేదు**

**2026 జనాభా లెక్కలు తేలిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన**

**పన్నులు చెల్లించి, సలాం కొట్టేందుకు మేం వ్యతిరేకం**

**: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్‌ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):** నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను 50 శాతం పెంచి డీలిమిటేషన్ చేపట్టాలనే ప్రధాని మోడీ విధానం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర విఘాతాన్ని కలిగిస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశానికే పెద్ద విపత్తులాంటిదని ఆయన హెచ్చరించారు. ఈ విధానంతో 542 ఉన్న సీట్లకు అదనంగా 270 సీట్లు పెరుగు తాయని తెలిపారు. వీటిని 2026 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2011 జనాభాల లెక్కల ప్రకారం **2లో...**

## 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి

**లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు**

**: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు**



**హైదరాబాద్‌ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):** అంగన్వాడీలకు సంబంధించిన మొబైల్ ఫోన్ల కొనుగోళ్ల విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి 48 గంటల్లో తనకు క్షమాపణ చెప్పాలనీ, లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని **మిగతా 2లో...**

## రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం

**న్యూఢిల్లీఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఎపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.



# ఏపీలో పరిశ్రమల ఏర్పాటు మరింత సులభం

## బ్రిటీష్ కాలం నాటి చట్టాల రద్దుపై చంద్రబాబు కీలక ఆదేశాలు

**పారిశ్రామిక అనుమతుల సరళీకరణపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం**

**బ్రిటీష్ కాలం నాటి చట్టాలను తొలగించి, నిబంధనలను సులభతరం చేయాలని ఆదేశం**

**మే చివరికల్లా డి-రెగ్యులేషన్ ఫేజ్-2ను పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యం**

**అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించేలా సంస్కరణలకు శ్రీకారం**

**డి-రెగ్యులేషన్‌లో కేంద్రం కంటే ఏపీ మెరుగ్గా ఉందని కేంద్ర బృందం ప్రశంస**

**అమరావతి,ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు, నిబంధనలను సులభతరం చేసేందుకు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను తొలగించి, వ్యాపారవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆర్డినెన్స్‌లు జారీ చేసి అయినా సరే, సంస్కరణలను వేగంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## ఓటు కోసం బయోమెట్రిక్ ...



**కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు**

**ఐరిస్ బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ విధానాలను ప్రవేశపెట్టాలని పిటిషన్**

**ఈ అభ్యర్థనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకారం**

**ప్రస్తుత ఎన్నికలకు అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టీకరణ**

**రానున్న కాలంలో జరిగే ఎన్నికల కోసం పరిశీలించాల్సి ఉందన్న సుప్రీంకోర్టు**

2లో.

# హార్మోజ్ దిగ్బంధనం ..!

**మొదటిపేజీ తరువాయి**

. . భారత కాలమానం ప్రకారం రాత్రి 7.30గంటలకు ట్రంప్ పెట్టిన గడువు ముగిసింది. ఆ వెంటనే అమెరికన్ నౌకాదళం పెద్ద సంఖ్యలో రంగంకి దిగింది. ఇరాన్ పోర్టులకు వెళ్లి. వచ్చే అన్ని నౌకలను అడ్డుకోవడం ప్రారంభించింది. ఇరాన్‌తో సంబంధంలేని ఇతర దేశాల పోర్టుల్లోకి వెళ్లి వచ్చే నౌకలను ఆపబోమని, ఇరాన్ పోర్టు వైపు వెళ్లడానికి ప్రయత్నించినా, అక్కడ నుండి రావడానికి ప్రయత్నించినా అడ్డుకుంటామని అమెరికా నౌకాదళం ప్రకటించింది. ఈ చర్యను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ బలగాలు దీనిని చట్ట విరుద్ధమైన చర్యగా, సముద్రపు దొంగతనం కిందకు వస్తుందని ప్రకటించాయి. ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని ప్రకటించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులో తాము అమలు చేస్తున్న దిగ్బంధనం వైపు ఇరాన్ నౌకలు, ఫాస్ట్ అటాక్ షిప్స్ వస్తే నాశనం చేస్తామని ప్రకటించారు. ఇరాన్‌కు చెందిన 158 నౌకలను అమెరికా దళాలు ఇప్పటికే ధ్వంసం చేశాయని పేర్కొన్నారు. మరోవైపు కాల్పుల విరమణ ఇంకా అమల్లో వుందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోమవారం ప్రకటించారు.

**చట్టవిరుద్ధ డిమాండ్లు మానుకుంటే చర్చలకు సిద్ధం : ఇరాన్**

తాజాగా రెండో దఫా చర్చలకు తాము సిద్ధంగానే వున్నామని ఇరాన్ ప్రకటించింది. అమెరికా చట్టవిరుద్ధమైన డిమాండ్లు చేయరాదని, తాము చెప్పే షరతులను వినాలని అలా జరిగినపుడు చర్చలకు తాము సుముఖమేనని ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలి తెలిపారు. ఇరాన్ శక్తి సామర్థ్యాలేమిటో అమెరికాకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. హార్మూజ్ జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లో వుందని, ఆ జలాలపై తమ హక్కును కాపాడుకుంటామని అన్నారు. శాంతి చర్చలకు ఇరాన్ కట్టుబడి వుందని, అదే సమయంలో అవసరమైతే సైనిక చర్యలకు కూడా సంసిద్ధంగా వున్నామని స్పష్టం చేశారు. అమెరికా, ఇరాన్ శాంతి చర్చలు జరపాలని, హార్మూజ్‌ను తెరిచి పశ్చిమాసియా సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని చైనా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆసియాన్ సహా పలు దేశాలు కోరుతున్నాయి. తాజా పరిణామాలతో మళ్ళీ చమురు ధరలు భగ్గుమన్నాయి. ట్రంప్ హెచ్చరికల నేపథ్యం లో బ్యారెల్ చమురు ధర వంద డాలర్లు దాటింది.

**సంయమనం పాటించాలి : చైనా**

అన్ని పక్షాలు సంయమనం పాటించాలని చైనా సోమవారం కోరింది. హార్మూజ్‌ను దిగ్బంధిస్తామని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ స్పందిస్తూ, తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాలకు సంబంధిత పక్షాలన్నీ కట్టుబడి వుండాలని కోరారు. రాజకీయ, దౌత్య మార్గాల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడానికి నిబద్ధతతో వుండాలన్నారు. అవసరమైతే సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చైనా సానుకూల, నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి సిద్ధంగా వుందని ప్రకటించారు.

**ఇరాన్‌కు ఆయుధాలా? : నిరాధారమన్న చైనా**

ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్నామన్న వార్తలను నిరాధారమైనవిగా చైనా స్పష్టం చేసింది. అమెరికా నిఘా వర్గాలను ఉటంకిస్తూ పలు వార్తా సంస్థలు ఈ మేరకు కథనాలు అందించాయి. ఆ నేపథ్యంలో గువో జియాకున్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, మిలటరీ ఉత్పత్తుల ఎగుమతి దిశగా చైనా ఎల్లప్పుడూ అత్యంత జాగరూకతతో, బాధ్యతా యుతమైన వైఖరిని అవలంబిస్తుందని చెప్పారు. తమ ఎగుమతి నియంత్రణా చట్టాలకు అనుగుణంగా, అంతర్జాతీయ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

పశ్చిమాసియాలో తాజా పరిణామాలను చైనా నాయకత్వంతో చర్చించేందుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ మంగళవారం బీజింగ్ వెళ్లనున్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి ఆహ్వానం మేరకే ఈ పర్యటన జరుగుతోంది.

**అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం : రష్యా ఆందోళన**

హార్మూజ్‌ను దిగ్బంధిస్తే అంతర్జాతీయ మార్కెట్లు దెబ్బతింటాయని రష్యా సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్ ఓడరేవులను, తీర ప్రాంతలను మొత్త ంగా దిగ్బంధిస్తామని అమెరికా హెచ్చరించిన నేప థ్యంలో క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ, ఇలాంటి విపరీత చర్యలు అంతర్జాతీయ మార్కెట్లను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయని అన్నారు.

**ఏ ఒక్క దేశానికీ ఆ హక్కు లేదు**

హార్మూజ్‌ను దిగ్బంధించే చట్టబద్ధమైన హక్కు ఏ దేశానికీ లేదని ఐక్యరాజ్య సమితి సముద్ర జలాల సంస్థ అధినేత ఆరెన్సియో డొమింగ్వెజ్ ఒక పత్రికా సమావేశంలో స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, అంతర్జాతీయ జలసంధుల ద్వారా ప్రయాణించే నౌకల రాకపోకలను అడ్డుకునే లేదా నిషేధించే హక్కు ఏ దేశానికీ లేదని, అవన్నీ అంతర్జాతీయ మార్గాలేనని చెప్పారు.

**ఇరాన్ నేవీ దిగ్బంధనానికి ఇజ్రాయిల్ మద్దతు**

ఇరాన్‌పై నేవీ దిగ్బంధన చర్యలు తీసుకోవాలన్న ట్రంప్ నిర్ణయాన్ని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు సమర్థించారు. ఈ విషయంలో అమెరికాకు పూర్తిగా మద్దతిస్తామని చెప్పారు.

**దక్షిణ లెబనాన్‌లో కీలక పట్టణాన్ని చుట్టుముట్టిన బలగాలు**

దక్షిణ లెబనాన్‌లో కీలకమైన పట్టణాన్ని తమ బలగాలు చుట్టుముట్టాయని ఇజ్రాయిల్ మిలటరీ సోమవారం ప్రకటించింది. ఈ కీలక పట్టణం హిజ్బుల్లా మిలటరీ సదుపాయాల కేంద్రమని పేర్కొంది. వ్యూహాత్మకమైన బింట్ జిబెల్ పట్టణంలో భూతల సైనిక కార్యకలాపాలను ప్రారంభించామని తెలిపింది. గత వారం రోజుల్లో వంద మందికి పైగా హిజ్బుల్లా కార్యకర్తలను హతమార్చామని వెల్లడించింది. దక్షిణ లెబనాన్‌లో స్కూలు, ఆస్పత్రి, కీలక కూడలి సమీపంలో ఇజ్రాయిల్ బలగాలు మాటు వేసి వున్నాయని హిజ్బుల్లా పేర్కొంది.

# ఏపీలో పరిశ్రమల ఏర్పాటు మరింత సులభం

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై చర్చించేందుకు కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని బృందం సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కేంద్ర బృందంతో సీఎం సమీక్ష.. మే నాటికి ఫేజ్-2 పూర్తి లక్ష్యం**

కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం, రాష్ట్రంలో డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో విస్తృతంగా చర్చించింది. పరిశ్రమల ఏర్పాటులో వేగాన్ని పెంచడం, అనుమతులను సులభతరం చేయడం, అనవసర నిబంధనలను తొలగించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్ సీఎంకు వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ఆయా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో భాగంగా 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఫేజ్-2లో 28 అంశాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అధికారులు వివరించారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

**బ్రిటీష్ చట్టాల రద్దు.. అనుమతుల సరళీకరణపై కీలక ఆదేశాలు**

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని, క్లిష్టతను పూర్తిగా తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు, లైసెన్సుల సంఖ్యను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని ఆదేశించారు. అయితే, ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

అనవసర వేధింపులు తగ్గించేందుకు థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని సూచించారు.

వ్యాపార రిజిస్ట్రేషన్లకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ విషయంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలంగా ఉండే సరళమైన నిబంధనలు అమలు చేయాలని, ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు పట్టే సమయం కనీసం 40 శాతం తగ్గాలని నిర్దేశించారు.

**ఒకే శాఖలో అనుమతుల విలీనం.. అవసరమైతే ఆర్డినెన్సులు**

డి-రెగ్యులేషన్ ఫేజ్-2ను వేగంగా అమలు చేయడానికి అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం ఉన్న 82 రకాల అనుమతులను దశలవారీగా 57కు తగ్గించాలని సూచించారు. బిల్డింగ్ ప్లాన్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వంటి వాటికి సంబంధించిన 30 ప్రక్రియలను 18కి తగ్గించాలని చెప్పారు. ఒకే శాఖ పరిధిలోని పలు అనుమతులను విలీనం చేయడం, కొన్నింటికి అనుమతులు కాకుండా కేవలం ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలకు కొనసాగింపుగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అన్ని అనుమతులు ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అఫిడవిట్‌తో వ్యాపారం.. డిజిటలైజేషన్‌కు పెద్దపీట**

పెట్టుబడిదారులకు మరింత భరోసా కల్పించే దిశగా, అఫిడవిట్ ఆధారంగానే వ్యాపారం ప్రారంభించే అవకాశాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. నిర్దిష్ట కాలం పాటు తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో అనుకూల వాతావరణం సృష్టించాలని అన్నారు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈ రంగం నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకు మొత్తం ప్రక్రియను డిజిటలైజ్ చేయాలని, దీనివల్ల పారదర్శకత పెరుగుతుందని వివరించారు. మీ సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ 'మన మిత్ర' వంటి వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సేవలను సులభతరం చేయాలని ఆదేశించారు. పర్యాటకం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో కూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

**ఏపీ పనితీరు అద్భుతం.. ఫేజ్-3లో ఏఐకి ప్రాధాన్యం**

డి-రెగ్యులేషన్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపిస్తున్న చొరవను, పనితీరును కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ప్రశంసించారు. కేంద్రం ప్రతిపాదించిన అంశాల కంటే ఏపీ మెరుగ్గా పనిచేస్తోందని, నిర్దేశిత గడువులోగా ఫేజ్-2ను పూర్తి చేస్తుందన్న నమ్మకం ఉందని అన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ, 'నేషన్ ఫస్ట్' నినాదంతో పనిచేస్తున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానానికి మారామని తెలిపారు. అటవీ చట్టాలను కూడా సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్‌ఎంఎస్ వంటి వ్యవస్థలను వినియోగిస్తున్నామని వారికి వివరించారు.

# భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది

## : ప్రధాని నరేంద్రమోదీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**


మరో నాలుగు రోజుల్లో మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో ఈ అంశంపై వేడి రగులుకుంది. 21వ శతాబ్దిలో భారత్ తీసుకుంటున్న అతి పెద్ద నిర్ణయం మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడం అని ఇప్పటికే ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ శతాబ్ది నారీ శక్తికి అంకితమని ప్రకటించారు. సోమవారం విజ్ఞాన్ భవన్‌లో 5వేల మంది మహిళల సమక్షంలో నిర్వహించిన 'నారీ శక్తి వందన' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక న్యాయం ఇక నినాదంగా కాక పని సంస్కృతిలో భాగం కాబోతోందని ప్రకటించారు. 'నారీ శక్తి వందన చట్టం' గురించి ఉధృతంగా గ్రామగ్రామాల్లో సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మహిళలతో సదస్సులు నిర్వహించాలని బీజేపీ తన పార్టీ విభాగాలను ఆదేశించింది. వివిధ రాష్ట్రాల నుంచి ముఖ్యమైన మహిళా నేతలందర్నీ ఢిల్లీకి పిలిపించిన బీజేపీ ఈ వారం రోజులూ ఢిల్లీలోనే ఉండి పెద్ద సంఖ్యలో కార్యక్రమాలు చేపట్టాలని వారికి నిర్దేశించింది. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ



జరిగే సమయంలో మహిళలు స్వయంగా పెద్ద ఎత్తున పార్లమెంటుకు వచ్చి తిలకించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేసింది.

**కాంగ్రెస్‌లో తర్జనభర్జన**

అయిదు రాష్ట్రాల ఎన్నికలయ్యేంత వరకూ ఈ అంశంపై చర్చించడానికి తాము సిద్ధంగా లేమని కాంగ్రెస్ ప్రకటించినప్పటికీ మోదీ పట్టించుకోక పోవడంతో ప్రధాన ప్రతిపక్షంలో ఈ అంశంపై తర్జన భర్జనలు మొదలయ్యాయి. పార్లమెంట్‌లో అవలంబించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఈ నెల 15న ఇతర ప్రతిపక్షాలతో సమావేశం ఏర్పాటు చేసింది. మరోపక్క ఏప్రిల్ 16న ప్రారంభమై మూడు రోజుల పాటు జరిగే సమావేశాలకు పూర్తి సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ ఎంపీలకు విప్ జారీ చేసింది. అత్యంత ముఖ్యమైన ఈ సమావేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోరాదని ఆదేశించింది. మహిళా రిజర్వేషన్‌కూ, డీ లిమిటేషన్‌కూ ముడిపెట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇతర ప్రతిపక్షాలు కలిసివస్తే రాజ్యాంగ సవరణ బిల్లులను వ్యతిరేకించాలని భావిస్తోంది. లోక్‌సభ సీట్లను 543 నుంచి 816 సీట్లకు పెంచడం వల్ల దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఇటీవల జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించిన విషయం తెలిసిందే.



నారీ శక్తి వందనా అధినియమ్‌పై(మహిళా బిల్లు) అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయమన్నా చేయకుండా మోదీ ఒంటెత్తు పోకడతో వ్యవహరిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ సోమవారం పత్రికలకు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి తాము వ్యతిరేకం కాదని, 2027 జనాభా లెక్కలకు ముందు డీలిమిటేషన్ ప్రక్రియను తాము వ్యతిరేకిస్తున్నామని సోనియాగాంధీ ఈ వ్యాసంలో పేర్కొన్నారు. ఏకపక్షంగా చేస్తున్న డీలిమిటేషన్ అత్యంత ప్రమాదకరమని, రాజ్యాంగం మీదే దాడి అని వ్యాఖ్యానించారు.

# మోడీ కుట్ర దేశానికే ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

మోడీ తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అనేవి ఒకటి కాదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, వెంటనే ఆ బిల్లును ఆమోదించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు గతంలో బీజేపీ సహకరించకపోవడం వల్లే లోక్‌సభలో ఆగిపోయిందని విమర్శించారు. నియోజక వర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్రం హడావుడిగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మోడీ సర్కారు వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను రెండింటినీ ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడ ం లేదంటూ ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలకు ఒకదాని కొకటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రెండింటిని విడదీసి వేర్వేరుగా చర్చించి, వాటి అమలుపై విధివిధానాలు రూపొందించాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని మోడీ ఇంతకాలం పట్టించుకోలేదని సీఎం విమర్శించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతునిచ్చిందని గుర్తు చేశారు. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చారనీ, అప్పుడు రాజ్యసభలో అది ఆమోదం పొందిందని తెలిపారు. అందులోనూ బీసీ కోటా ఉండాలనేది తమ పార్టీ నిర్ణయమని చెప్పారు. పురుషులతోపాటు మహిళలకూ ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. అప్పటికి ప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదని, పురుషులతోపాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించామని గుర్తు చేశారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్‌సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని అన్నారు. రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకొచ్చారని గుర్తు చేశారు. 40 ఏండ్లలో బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని ఒక్క మహిళకైనా ఇచ్చారా? అని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2026 జనాభా లెక్కల గెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామంటూ బీజేపీ ప్రభుత్వం చట్టం చేసిందని సీఎం గుర్తు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 543 లోక్‌సభ సభ్యుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, 181 మంది మహిళలు ఎన్నికయ్యేందుకు అవకాశం ఉండేదన్నారు. ఆ చట్టాన్ని లోక్‌సభలో ఆమోదించినప్పుడే అమలు కాకుండా బీజేపీ అడ్డుకుందని గుర్తు చేశారు. ఆ రకంగా మహిళలకు రిజర్వేషన్లను దూరం చేసిందని విమర్శించారు. 2026 జనాభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టాన్ని ముందుకు తెస్తున్నారని తెలిపారు. 2026 జనాభా లెక్కల ప్రకారమనే నిబంధనను సవరించుకుంటే, 2029 లోక్‌సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల అమలుకు అవకాశం ఉంటుందని సూచించారు. మహిళా రిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంలో బీజేపీ రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోడీ రాజకీయ పావుగా, ప్రమాదకరంగా వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఓటు కోసం బయోమెట్రిక్ విధానం... కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**

భారతదేశ ఓటింగ్ ప్రక్రియలో ఐరిస్ బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ విధానాలను ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అమలు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఈ అభ్యర్థనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ఈరోజు అంగీకరించింది.

ఇప్పటికే కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఎన్నికలు పూర్తయ్యాయి. తమిళనాడులో ఏప్రిల్ 23న... పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న రెండు విడతల్లో ఓటింగ్ జరగనుంది. ఈ క్రమంలో ప్రస్తుత ఎన్నికలకు ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టం చేసింది.

రానున్న కాలంలో జరగబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలకు బయోమెట్రిక్ విధానం అమలు చేయడాన్ని పరిశీలించాల్సి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశంపై స్పందించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

# 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి

ఆమె హెచ్చరించారు. ఈ మేరకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీతక్క సోమవారం లీగల్ నోటీసులు పంపారు. మంత్రి తరపున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్ట్ ద్వారా కేసీఆర్‌కు నోటీసు పంపారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్) నిర్వహించిందని నోటీసులో సీతక్క పేర్కొన్నారు. టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ జరిగిందని గుర్తుచేశారు. ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం టెండర్ విలువ రూ.44.42 కోట్లేనని గుర్తుచేశారు. అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని కొట్టిపారేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని వివరించారు. ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టీజీటీఎస్ ద్వారా వాటిని కొనుగోలు చేశామని వివరించారు. బీఆర్ఎస్ తన అధికారిక సోషల్ మీడియా వేదికగా తనపై చేస్తున్న దుష్ప్రచారానికి పార్టీ అధినేతగా కేసీఆరే బాధ్యత వహించాలని సీతక్క డిమాండ్ చేశారు. 48 గంటల్లో ఆయా సోషల్ మీడియాల్లో పోస్టుల ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కేసీఆరే స్వయంగా క్షమాపణ చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో కూడా తనపై ఇలాగే తప్పుడు ఆరోపణలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేటీఆర్ ప్రశ్నలకు తాను గట్టిగా సమాధానం చెప్పిన తర్వాతనే తనపై ఇలాంటి దాడి మొదలైందని సీతక్క గుర్తుచేశారు.

# ఇకపై నిధి పోర్టల్ ద్వార ఆపెన్షన్ల పంపిణీ

## ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

**అమరావతిఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల మంజూరు పక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి, మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధికారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వాత వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యంగా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి.్ ÷ల్ ఏ స్టేజ్‌లో ఉందో అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకు సేవలు అందుతాయి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ పేపర్లను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం.

# తెలంగాణలో ఈ నెల 22 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె

**ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 22వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత నెల 13వ తేదీన యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపింది. కానీ యాజమాన్యం నుంచి ఎలాంటి హామీ రాలేదని వెల్లడించింది. ప్రభుత్వం, యాజమాన్యం ముందు తాము 32 డిమాండ్లను ఉంచామని పేర్కొంది.ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని పలు డిమాండ్లు యాజమాన్యం ముందు ఉంచినట్లు తెలిపారు.

# అరైవ్ అలైవ్ ప్రచారం: గ్రామస్తుల్లో ట్రాఫిక్ చైతన్యం

### ట్రాఫిక్ నియమాలు పాటించాలి : పోలీసుల పిలుపు





**భీమదేవరపల్లి/ఏప్రిల్13 (జర్నలిస్ట్ వార్త):** అరైవ్ అలైవ్ ప్రచారం 4వ దశలో భాగంగా ముల్కనూర్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో సోమవారం రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామంలో గ్రామ సభ నిర్వహించి, గ్రామ పెద్దలతో కలిసి రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధులపై బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం కల్పించారు. గ్రామస్తులకు హెల్మెట్లను పంపిణీ చేసి, రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ వినియోగం ఎంత ముఖ్యమో వివరించారు. సుమారు 100 మంది గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేశారు. అలాగే గ్రామ ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో "నో ఎంట్రీ నో హెల్మెట్" హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు.



### వంగర పోలీసుల ఆధ్వర్యంలో రాంనగర్‌లో అవగాహన ర్యాలీ

వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ గ్రామంలో సోమవారం రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "అరైవ్ అలైవ్" ప్రోగ్రామ్ 4వ విడతలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ జి. దివ్య మాట్లాడుతూ, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి మరియు వరంగల్ సీపీ శ్రీ సన్ ప్రీత్ సింగ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరిస్తూ, రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలు, బాధిత కుటుంబాల కష్టాలు మరియు నిజజీవిత సంఘటనలను హృదయానికి హత్తుకునేలా వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా రాంనగర్ గ్రామంలోని ప్రముఖులతో కలిసి రోడ్డు భద్రత నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం గ్రామస్థులతో హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, హెల్మెట్ లేకుండా గ్రామంలోకి అనుమతించబోమని ప్రమాణం చేయించారు.

అనంతరం గ్రామంలో అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించగా, సుమారు 200 మంది గ్రామస్థులు పాల్గొన్నారు. హెల్మెట్ లేని వారికి జిల్లెలుగడ్డ గ్రామానికి చెందిన భుక్య వీరన్న ఆధ్వర్యంలో 40 హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముత్తారంలో 'మన ఊరు మన బడి' ర్యాలీ



**భీమదేవరపల్లి/ఏప్రిల్13 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో సోమవారం "మన ఊరుమన బడి" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టి ప్రజల్లో విద్యపై చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శరత్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రియదర్శిని, రాజిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2026 27 విద్యా సంవత్సరానికి సంబంధించిన "బడిబాట" కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు పెంపు, పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యా నాణ్యత మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. "మన ఊరుమన బడి" నినాదంతో గ్రామంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అర్హత గల ఉపాధ్యాయుల సేవల గురించి ప్రజలకు వివరించారు.

# కోటగడ్డ జిపిలో రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు.

-పంచాయతీని గంజాయి రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం.

-గ్రామస్తులు హెల్మెట్ ధరించాలని తీర్మానం.-సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పాలకవర్గం ప్రతిజ్ఞ.

**బయ్యారం/,ఏప్రిల్ 13.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలంలోని కోటగడ్డ గ్రామపంచాయతీని గంజాయి రహిత గ్రామంగా మార్చడమే లక్ష్యంగా,హెల్మెట్ లేని ప్రయాణం సురక్షితం కాదని,హెల్మెట్ మా గ్రామంలో వాహనదారులు ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని పంచాయతీ పాలకవర్గంతో సీఐ రవీందర్ ప్రతిజ్ఞ చేపించారు.గ్రామ సర్పంచ్ కాయం వరలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేశారు.గార్ల బయ్యారం సీఐ రవీందర్ పర్యవేక్షణలో గ్రామ ప్రజలకు గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు,హెల్మెట్,రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.పంచాయతీలో కీలక కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పాలకవర్గానికీ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి,ఉపసర్పంచ్ శ్రీనివాస్,వార్డు సభ్యులు సందీప్, వెంకన్న,కుమార్,జ్యోతి, పురుషోత్తం, శిరీష, అపర్ణ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సింగారంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంపై అవగాహన

**బయ్యారం/,ఏప్రిల్ 13.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రమాదాల నివారణకు గ్రామస్తులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, బయ్యారం మండల సిఐ,ఎస్ఐ ఆదేశానుసారం గ్రామ సర్పంచ్,గ్రామ పోలీస్,స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొనగా సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత గురించి వివరిస్తూ ప్రజల తమ ప్రాణాల భద్రతకు,మన కుటుంబాల భవిష్యత్తు గురించి వాహనదారులు హెల్మెట్ ధరించాలని,మద్యం సేవించకుండా జాగ్రత్తగా గమ్యం చేరాలని సూచించారు.గ్రామంలో రోడ్డు భద్రత కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చుంచు మమతా సాయికిరణ్,వార్డు సభ్యులు చుంచు అనిల్ కుమార్, చెరుకుపల్లి మనీషా,బాధవత్ లల్యా నాయక్,గుగులోత్ అనూష,బానోత్ సరితా,సపవత్ అనిత,గంగావత్ పద్మ,చుంచు సుగుణ,సపవత్ గోపి,చాట్ల వెంకన్న,చెరుకుపల్లి రవి, గుగులోత్ మహేష్,గుగులోత్ రెడ్యా,గుగులోత్ స్వరూపరాణి,చుంచు బాలరాజు,సంతోష్,బాబురావు వంశీ తదితరులు పాల్గొన్నారు.


# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం తనిఖీ

-మండల వ్యవసాయ అధికారి కే.రాజు

**బయ్యారం/,ఏప్రిల్ 13.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి కే. రాజు సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా రైతులకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరపై అవగాహన కల్పించారు.రైతులు తమ పంటను మధ్యవర్తులకు అమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని,మధ్యవర్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించవద్దని సూచించారు.

ఈ సందర్భంగా అగ్రి-ఎంఎస్ పి పోర్టల్‌లో రైతు నమోదు ప్రక్రియపై ఒక రైతుతో ప్రత్యక్ష ప్రదర్శన చేశారు. నమోదు విధానం,అవసరమైన వివరాలు,ప్రక్రియపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. బయ్యారం సోసైటీలో నిర్వహిస్తున్న అన్ని



రిజిస్టర్లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో బయోమెట్రిక్ ధృవీకరణ విధానం గురించి చర్చించారు.రైతుల బయోమెట్రిక్ వివరాలు అగ్రి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయబడతాయని,ప్రతి రైతుకు రెండు దఫాలుగా ధృవీకరణ జరుగుతుందని తెలిపారు.మొదటిది నమోదు సమయంలో,రెండవది పంట లోడ్



చేసేముందు నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు.ఇప్పటి వరకు బయ్యారం మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో మొత్తం 10,451 క్వింటాళ్లు 150 మంది రైతులకు సంబందించిన మొక్కజొన్న కొనుగోళ్లు జరిపినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు,వ్యవసాయ విస్తరణ అధికారులు సోసైటీ సీఈఓ,కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# కాచనపల్లిలో మొక్కజొన్న పంట నష్టంపై వ్యవసాయ అధికారుల పరిశీలన.

**బయ్యారం/,ఏప్రిల్ 13.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలం కాచనపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటనపై మండల వ్యవసాయ అధికారి కే. రాజు ఆధ్వర్యంలో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ యాల రేవతి, వ్యవసాయ విస్తరణ అధికారి అఖిల్,గ్రామ రైతులు పాల్గొన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు,అగ్ని ప్రమాదం వల్ల సుమారు 6 ఎకరాల మేరకు మొక్కజొన్న పంట నష్టపోయినట్లు గుర్తించారు.ఈ ప్రమాదంలో పాయం శేఖర్,ముడిగ వజ్జయ్య,భూతం వెంకన్న,పాయం సారయ్య,కిన్నెర ఆదెమ్మ,వేప శ్రీను లకు చెందిన మొక్కజొన్న పంట



దగ్ధమయ్యాయి.

ఈ సందర్భంగా నష్టపోయిన రైతులను పరామర్శించి,వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుండి అందుబాటులో ఉన్న పరిహారం,ఇతర సహాయక చర్యలపై వారికి అవగాహన కల్పించారు.




సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని రైతులకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.వ్యవసాయ శాఖ రైతులకు ఇలాంటి ప్రమాదాల నివారణ కోసం విద్యుత్ లైన్ల సమీపంలో జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

# కోతుల బీభత్సం

## - వృద్ధుడిపై దాడి

### - గణపురం మండల కేంద్రంలో ఘటన

- తీవ్రంగా గాయపడిన 62 ఏళ్ల వృద్ధుడు - స్థానికుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

**గణపురం/, మే 13 (జర్నలిస్ట్ వార్తలు):** మండల కేంద్రంలో కోతుల బీభత్సం రోజు రోజుకు పెరుగుతోంది. సోమవారం గణపురానికి చెందిన కాడసుల రాజారాం (62)పై కోతులు ఆకస్మికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి.





వివరాల్లోకి వెళ్తేడ ఇంటి సమీపంలో ఉన్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన కోతుల గుంపు రాజారాంపై దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. అప్పటికి గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై కోతులను తరిమికొట్టి వృద్ధుడిని రక్షించారు. అనంతరం చికిత్స కోసం సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల మండల కేంద్రంలో కోతుల సంచారం అధికమై ప్రజల్లో భయాందోళనలు నెలకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. వెంటనే చర్యలు తీసుకుని కోతుల బెడదను నియంత్రించాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహణ





**ఖమ్మం,/ ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా నూతన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు అంగన్వాడి కేంద్రంలో సోమవారం ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ వైద్య బృందం, వాసన్ ఐ కేర్ ఖమ్మం వైద్య బృందం పాల్గొని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణంగా రూ.2000 నుంచి రూ.3000 వరకు ఖర్చయ్యే వివిధ వైద్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించడం విశేషం. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన పేషెంట్లకు సమగ్ర హెల్త్ చెకప్‌లు చేసి అవసరమైన సూచనలు ఇచ్చారు.

రావూరి జాన్ బాబు మేనేజర్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అఖిల్, డాక్టర్ నిలోఫర్, డాక్టర్ సాయి దుర్గ, డాక్టర్ ఉమాదేవి (కార్డియాలజిస్ట్)తో పాటు టెక్నీషియన్ సిబ్బంది సేవలందించారు. అలాగే పితాని వెంకటేష్ మేనేజర్ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ వైద్య బృందం నుంచి డాక్టర్ విద్య, రామకృష్ణ (ఏఆర్) పాల్గొన్నారు.శిబిరానికి హాజరైన వైద్య బృందానికి, హెల్త్ చెకప్ కోసం వచ్చిన ప్రజలకు భోజనాలు అదాలత్ నరేందర్ ఏర్పాటు చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా మజ్జిగ ప్యాకెట్లు షేక్ పాషా, అరటి పండ్లు ఆకుల సైదులు అందించారు.ఈ ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించడంపై వైద్య బృందానికి యూనియన్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులు అదాలత్ నరేందర్, వెంపటి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు వెంపటి ఉపేందర్, యూనియన్ అధ్యక్షుడు నునావత్ కిషన్, ఉపాధ్యక్షులు షేక్ పాషా, కత్రం గిరి, బి భద్రం, కార్యదర్శి షేక్ జానీ, ఖజాంచి ముదిశెట్టి రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీ నామాల నరసింహారావు, ఈసీ సభ్యులు గట్ల అంజి, దుర్గారావు దిలీప్, వీరబాబు, రఘు, గోపి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాల దిశగా తెలంగాణ

## కెసిఆర్ నాయకత్వం పై విశ్లేషణ

సమాజంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే నిజమైన అభివృద్ధి అనే భావజాలాన్ని ప్రతిష్ఠించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. ఆయన చూపిన మార్గం సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ఆర్థిక స్వావలంబన. ఈ ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన పాలన అని రాజకీయ విశ్లేషకులు భావిస్తుంటారు. తెలంగాణలో ఆ దిశగా ప్రయాణం సాగించిన నాయకుడిగా కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కెసిఆర్) పేరు ప్రాధాన్యం పొందుతోంది.రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణలో అమలైన సంక్షేమ పథకాలపై దృష్టిపెడితే, అంబేద్కర్ ఆశయాలకు దగ్గరగా ఉన్న విధానాలే కనబడుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం లక్ష్యంగా రూపొందించిన పథకాలు సామాజిక సమతుల్యతకు దోహదం చేశాయని వారు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దళిత బంధు వంటి పథకం ద్వారా నేరుగా ఆర్థిక సహాయం అందించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగినట్టు తెలుస్తోంది.



### హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం చరిత్రలో నిలిచే నిర్ణయం

హైదరాబాద్ నగర నడిబొడ్డున అంబేద్కర్ మహావిగ్రహాన్ని ప్రతిష్ఠించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది కేవలం ఒక విగ్రహం మాత్రమే కాదు, అంబేద్కర్ ఆశయాల పట్ల గౌరవానికి చిహ్నంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

### సంక్షేమం అభివృద్ధి సమతుల్యత

కెసిఆర్ పాలనలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమాంతరంగా సాగుతున్నాయని పేర్కొంటున్నారు. రైతులకు మద్దతు, పేదలకు గృహాలు, విద్యార్థులకు అవకాశాలు అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా చర్యలు తీసుకున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. అంబేద్కర్ ఆశయాల ప్రకారం, సమాజంలో ప్రతి వర్గం ఎదగాలంటే ప్రభుత్వ పాత్ర కీలకమని, అదే దిశగా తెలంగాణలో ప్రయత్నాలు జరిగాయని వారు భావిస్తున్నారు.

### కాంగ్రెస్ పాలనపై విమర్శలు మార్పు కోసం ఎదురుచూపులు

కొన్ని వర్గాలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రత్యామ్నాయ నాయకత్వం వైపు చూస్తున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత అనుభవాల దృష్ట్యా, అభివృద్ధి సంక్షేమం కలిపిన పాలన అవసరమని ప్రజలు భావిస్తున్నారని విశ్లేషణలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కెసిఆర్ నాయకత్వం మళ్లీ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అంటున్నారు.

### అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శకం

రాష్ట్రం నిజమైన అభివృద్ధి సాధించాలంటే, బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాల్సిన అవసరం ఉంది. అదే అంబేద్కర్ చూపిన దారి. ఆ దారిలో నడుస్తూ సమాజాన్ని సమగ్ర అభివృద్ధి వైపు తీసుకెళ్లే నాయకత్వం అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈమొత్తంగా చూస్తే, అంబేద్కర్ ఆశయాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి సంకల్పంతో ముందుకు సాగిన నాయకత్వంగా కెసిఆర్‌ను భావించే వర్గాలు పెరుగుతున్నాయి. సామాజిక న్యాయం, సమానత్వం, ఆర్థిక స్వావలంబన ఈ మూడు లక్ష్యాలను సాధించాలంటే ఆ దిశగా కట్టుబడి పనిచేసే నాయకత్వం కీలకం. తెలంగాణ రాజకీయాల్లో ఆ పాత్రను కెసిఆర్ పోషించారని విశ్లేషణలు సూచిస్తున్నాయి.



కొట్టే ప్రవీణ్
మాజీ విజిలెన్స్ కమిటీ మెంబర్
8106957871

# అంబేద్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

**- చట్టాల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలి**
**- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నరపు మహేందర్**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ వార్త):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నరపు మహేందర్ ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని, వాటి అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మాత్రమే కాకుండా ప్రపంచ మేధావిగా నిలిచారని అన్నారు. అణగారిన వర్గాలకు స్వరమిస్తూ, వారి హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని కొనియాడారు. రాజ్యాంగ రూపకల్పన ద్వారా సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ అనే మూల సూత్రాలను దేశానికి అందించారని గుర్తు చేశారు.కార్మికుల హక్కుల పరిరక్షణలో అంబేద్కర్ పాత్ర విశేషమని, ముఖ్యంగా 12 గంటల పనిదినాన్ని 8 గంటలకు పరిమితం చేయించడం ద్వారా కార్మికులను వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించారని తెలిపారు. కార్మిక చట్టాల రూపకల్పనలో ఆయన చూపిన దూరదృష్టి కారణంగా నేటి కార్మిక వర్గం గౌరవప్రదమైన జీవితం గడుపుతోందన్నారు.



అంబేద్కర్ మహిళల హక్కుల పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనిచ్చారని, స్త్రీలకు సమాన హక్కులు కల్పించే దిశగా అనేక చట్టాలను తీసుకువచ్చారని చెప్పారు. వ్యవసాయ రంగంలో కూడా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు సంస్కరణలు చేపట్టారని వివరించారు.ప్రపంచవ్యాప్తంగా అంబేద్కర్ ఆలోచనలు, రచనలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయని, అనేక దేశాలు ఆయన సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఆయన రూపొందించిన రాజ్యాంగం, చట్టాలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు.ప్రస్తుతం కూడా అంబేద్కర్ ఆశయాలు సమాజానికి అత్యంత అవసరమని, ప్రభుత్వం వాటి అమలులో చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. పేదలు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలు కచ్చితంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు.ఇలాంటి మహనీయుడికి దేశ ప్రజలందరూ రుణపడి ఉన్నారని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా సమానత్వ సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. కార్మిక సంఘాల తరఫున అంబేద్కర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ 'జై భీమ్' అంటూ మహేందర్ పిలుపునిచ్చారు.

# చలి వేంద్రం ప్రారంభించిన సర్పంచ్

## ప్రయాణికుల దాహార్తి తీర్చడమే లక్ష్యం




**రాయపర్తి/, ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని శివరామపురం గ్రామ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని సోమవారం సర్పంచ్ షీలా హేమలత రత్నాకర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వీరేంద్ర నాయక్, ఉప సర్పంచ్ భూక్య లక్ష్మణ్, వార్డు సభ్యులు చెడుపాక అనిత, చెడుపాక భరత్, కారోబార్ మహాత్మ తదితరులు పాల్గొన్నారు

# ఏలుకుర్తిలో ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

## ఏప్రిల్ 16న కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు 2000 మందికి అన్నదానం

**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోఏప్రిల్13 (జర్నలిస్ట్ వార్త)** సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలిచిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల 16న హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఏలుకుర్తి గ్రామంలో ఘనంగా ఆవిష్కరించనున్నట్లు విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కొలిపాక రాజు తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు అణగారిన వర్గాల ప్రజల సమిష్టి సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దశాబ్దాలుగా గ్రామంలో ఉన్న ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ప్రజలే ముందుకు వచ్చి నిధులు సమీకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహరాజ్, ప్రొఫెసర్ కాసిం విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని వివరించారు. వారి సమక్షంలో అంబేద్కర్ ఆశయాలపై సభ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.విగ్రహ నిర్మాణానికి గ్రామ



సర్పంచ్ నరిశెట్టి సుధాకర్ విగ్రహ దాతగా, కొలిపాక ప్రకాశం స్థల దాతగా కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అదనంగా గ్రామంలోని పలువురు దాతలు, యువత, సంఘాలు సహకరించి ఈ విగ్రహ



నిర్మాణాన్ని పూర్తి చేయడంలో భాగస్వాములయ్యారని చెప్పారు.ఈ నెల 16న జరిగే ఆవిష్కరణ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తూ, సుమారు 2000 మందికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.ధర్మసాగర్ మండలంలోని ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈ విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షయ మృతి అత్యంత బాధాకరం

## తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు: పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి/, ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని బురాన్‌పల్లి గ్రామానికి చెందిన బాల కుమార్‌లత దంపతుల కుమార్తె బాల అక్షయ మృతి స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. ఇంటర్‌మీడియట్ చదువుతున్న అక్షయ ఆదివారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో ఒక సబ్జెక్టులో విఫలమవడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.ఈ ఘటన తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం అక్షయ పార్థివదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షయ మృతి అత్యంత బాధాకరమని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి పరిస్థితుల్లో తొందరపడి నిర్ణయాలు తీసుకోకూడదని, జీవితంలో సమస్యలు తాత్కాలికమేనని గుర్తుంచుకోవాలని సూచించారు. యువత తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని, కుటుంబ సభ్యులు కూడా పిల్లలపై మానసిక ఒత్తిడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, గొల్లపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆలస్యం అయినా పర్వాలేదు సురక్షితంగా ఇంటికి చేరాలి

**- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సందేశం - 'అరైవ్ ఆలైవ్' కార్యక్రమంలో అవగాహన**





**ఎల్కతుర్తి/, మే 13 (జర్నలిస్ట్ వార్త):**
వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా ఇంటికి చేరుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. ఆలస్యం అయినా పర్వాలేదని, సురక్షితంగా ఇంటికి చేరడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. మీ రాక కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారని గుర్తుంచుకోవాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'అరైవ్ ఆలైవ్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతలపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్ అధికారులు ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో కమిషనర్‌తో పాటు సెంటర్ జోన్ డీసీపీ ధార కవిత, స్థానిక పోలీస్ అధికారులు, గ్రామ యువత పాల్గొని ప్రజల్లో చైతన్యం కల్పించారు.గ్రామసభలో మాట్లాడుతూడ మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. అతివేగం ప్రాణాంతకమని, ప్రతి వాహనదారుడు అప్రమత్తంగా వాహనం నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం గ్రామసభలో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోకి ప్రవేశించే ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్




ధరించాలని, లేనిపక్షంలో గ్రామంలో ప్రవేశం ఉండదని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చేతుల మీదుగా గ్రామస్తులకు హెల్మెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఇన్స్‌పెక్టర్లు సుధాకర్ రెడ్డి, చేరాలు, ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, రాజు, సర్పంచ్ రజిత రవీందర్, మార్కెట్ చైర్మన్ సంతాజీతో పాటు ఇతర పోలీస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయంలో వాహనాల నిలుపుదలపై వివాదం



**తల్లాడ, /ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండల పరిధిలోని తెలంగాణ ప్రభుత్వం చిన్న నీటి పారుదల శాఖ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం వద్ద వాహనాల నిలుపుదలపై వివాదం నెలకొంది. కార్యాలయం వరండాలో అనుమతి లేకుండా వాహనాలను నిలుపుతున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.
వివరాల ప్రకారం, **TS04EE 7006** నంబర్ గల వాహనం యజమాని గాదె రామ్మోహన్ కార్యాలయం ప్రాంగణంలో వాహనాన్ని నిలిపి ఉంచుతున్నారని, దీనిపై ప్రశ్నించగా ఆయన దురుసుగా ప్రవర్తించినట్లు




ఆరోపణలు వినిపిస్తున్నాయి. “మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి” అంటూ ఎదురు సమాధానాలు ఇస్తూ, సంబంధిత శాఖ అధికారుల వివరాలు అడిగినా “నీకెందుకు చెప్పాలి” అంటూ స్పందించినట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాన్ని వ్యక్తిగత వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించడం సరైనదా అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. అధికారులు ఈ విషయంపై స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి

## హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు కీలకం: ఎస్ఐ ముత్యం రాజేందర్

**రాయపర్తి/, ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**



ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని ఎస్ఐ ముత్యం రాజేందర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ‘99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతపై పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ఉపయోగించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. అతివేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరిస్తూ, కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టే పరిస్థితులు రాకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు హెల్మెట్ వినియోగంపై ప్రోత్సాహం ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కమిటీని కూడా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గారే సాహెంద్ర బిక్షపతి, ఉప సర్పంచ్ మచ్చ రమేష్, కార్యదర్శి వల్లే వినోద్ కుమార్, వార్డు సభ్యులు గారే కళ్యాణి విష్ణు, ఎండీ ఫెరోజ్, పిరని రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా “అరైవ్ అలైవ్” అవగాహన కార్యక్రమం

**నర్సంపేట/, ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నర్సంపేట పట్టణంలో “అరైవ్ అలైవ్” రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ “అరైవ్ అలైవ్” అనేది కేవలం కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడే ఉద్యమమని పేర్కొన్నారు. యువత అతివేగం పట్ల అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. తల్లిదండ్రులు తమ




పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం ప్రమాదకరమని వివరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.
అనంతరం మున్సిపల్ సిబ్బంది రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి ప్రజలకు అవగాహన



కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై గూడ అరుణ్, మున్సిపల్ కౌన్సిలర్లు భూక్య మాత్రు రాథోడ్, ఏవూరి శ్రీనివాస్ రెడ్డి, ఎలుకంటి విజయ్, వేముల సంధ్య సాంబయ్య గౌడ్, ముత్తినేని వెంకన్న, హనుమకొండ శ్రీధర్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనిషా ప్రకాష్, కొత్తకొండ మేఘన శ్యామ్ రాజ్, కొంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, పోలీస్ మరియు మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి: తాసిల్దార్

## రోడ్డు భద్రత వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమం, ప్రతిజ్ఞ చేసిన అధికారులు

**తల్లాడ/, ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**



రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తల్లాడ తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా తల్లాడ మండల పంచాయతీ కార్యాలయ ఆవరణంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాహనం నడిపేటప్పుడు అప్రమత్తత చాలా ముఖ్యమని, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి అలవాట్లు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం తగ్గుతుందని చెప్పారు. యువత అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక కుటుంబాలు దెబ్బతింటున్నాయని, తల్లిదండ్రులకు కన్నీటి ముద్రలు మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్ రాజు, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి), ఆర్ఐ కాజా మోహినుద్దీన్, ఈవో కృష్ణారావు, హెడ్ కానిస్టేబుల్ చెన్నారావు తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గణపురంలో నిధి కలకలం

**ఎర్రమ్మ గుడి వద్ద రహస్య తవ్వకాలు**

**వారసత్వ సంపదపై కన్నేసిన అక్రమార్కులు..?**

**సెలవు రోజునే పని కానిచ్చేశారు!**

**గణపురం/ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**
చారిత్రక కాకతీయ కట్టడాలకు నిలయమైన గణపురంలో మరోసారి గుప్తనిధుల వేట మొదలైందా? పురాతన ఎర్రమ్మ గుడి సాక్షిగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. చారిత్రక ప్రాధాన్యత కలిగిన గణపేశ్వరాలయ సమీపంలోని ఎర్రమ్మ గుడి వద్ద ఆదివారం గుట్టుచప్పుడు కాకుండా సాగిన తవ్వకాలు ఇప్పుడు స్థానికంగా పెను దుమారాన్ని రేపుతున్నాయి.

**శుభ్రత ముసుగులో అసలు కథ..!**

ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్నామనే సాకుతో కొందరు వ్యక్తులు భారీగా మట్టిని తవ్వడం అనుమానాలకు తావిస్తోంది. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో, అధికారుల నిఘా ఉండదని పక్కా ప్లాన్‌తో ఈ తవ్వకాలు చేపట్టినట్లు



తెలుస్తోంది. ఎటువంటి అనుమతులు లేకుండా, అధికారుల పర్యవేక్షణ లేకుండా చారిత్రక ప్రదేశంలో ఇలాంటి పనులు చేయడం వెనుక గుప్తనిధుల కోణం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది.

**తెరపైకి పాత కథలు.. ఆందోళనలో గ్రామస్థులు**

గతంలోనూ ఈ ప్రాంతంలో పురాతన నాణేలు, బంగారు ఆభరణాలు లభించాయనే ప్రచారం ఉంది. దీంతో నిధి అన్వేషకుల కన్ను ఎప్పుడూ గణపురంపైనే ఉంటోంది. కాకతీయుల కాలం నాటి అపురూప కట్టడాలు, శిల్ప సంపద ఉన్న ఈ ప్రాంతంలో అక్రమ తవ్వకాలు జరపడం వల్ల చారిత్రక వారసత్వానికి ముప్పు వాటిల్లుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.



**అధికారుల మౌనం.. బాధ్యులపై చర్యలకు డిమాండ్**

ఇంత జరుగుతున్నా పురావస్తు శాఖ గానీ, రెవెన్యూ అధికారులు గానీ స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంగా మారుతోందని మండిపడుతున్నారు. చారిత్రక సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పోలీసులు వెంటనే విచారణ చేపట్టి, ఈ తవ్వకాల వెనుక ఉన్న అసలు సూత్రధారులను కఠినంగా శిక్షించాలి. లేకపోతే అమూల్యమైన పురాతన సంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. తవ్వకాలను వెంటనే నిలిపివేసి, ఆలయ పరిసరాల్లో నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. మరి ఇప్పటికైనా యంత్రాంగం మేల్కొంటుందో లేదో చూడాలి మరి

# నేడు తల్లాడలో మంత్రి పొంగులేటి పర్యటన

## బాలపేటలో గ్రామపంచాయతీ భవనం, తల్లాడలో అంబేద్కర్ భవనానికి ప్రారంభోత్సవం






**తల్లాడ,/ ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం తల్లాడ మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా బాలపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం తల్లాడ పట్టణంలో నిర్మించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మితమైన ఈ భవనం స్థానికులకు సామాజిక కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడనుంది. కాంట్రాక్టర్ వెదురు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

# ఉనికిచెర్లలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన

## ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాల నివారణకు చర్యలు




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన “అరైవ్‌అలైవ్” కార్యక్రమం కింద ఉనికిచెర్ల గ్రామంలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ రోడ్డు భద్రత కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 64వ విభాగ కార్పొరేటర్ శ్రీమతి అలువాల రాధిక రెడ్డి, ధర్మసాగర్ ఎస్ హెచ్ ఓ కె. శ్రీధర్ రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రతా నియమాల పాటింపు, ప్రజల బాధ్యతలపై సమావేశం ఏర్పాటు చేసి వివరణాత్మకంగా చర్చించారు. సమావేశంలో గ్రామ ప్రజలు, యువత, నాయకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అనుసరించాల్సిన చర్యలపై చర్చించి, అందరూ కలసి ఒక తీర్మానం ఆమోదించారు. అనంతరం రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించి నియమాలు తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద “తల రక్షణ లేకుంటే ప్రవేశం లేదు” అనే హెచ్చరిక పలకలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణమయ్యే ప్రదేశాలను గుర్తించి, అక్కడ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. వేగ పరిమితి పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, రక్షణ పరికరాలు ధరించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడంతో పాటు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. సమిష్టి కృషితోనే రహదారి ప్రమాదాలను తగ్గించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం

## వార్డు కౌన్సిలర్లు, జేఏసీ నాయకులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

## మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి





**వర్ధన్నపేట/ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):** భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను వర్ధన్నపేట పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తెలిపారు. సోమవారం ఆయన ఉత్సవ కమిటీ (జేఏసీ) నాయకులు, అధికారులతో కలిసి వేడుకల ప్రాంగణాన్ని సందర్శించి, ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 8 గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాగునీటి వసతి, నీడ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమ స్థలంలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఈ వేడుకలను పండుగలా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. జేఏసీ నాయకులు తుమ్మల శ్రీధర్ మాట్లాడుతూ ఉత్సవాల విజయవంతానికి తాము పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఇమ్మడి సుధీర్ కుమార్, వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, జేఏసీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వంచనగిరిలో ప్రహరీ గోడ వివాదం

## ఇరువర్గాలపై కేసు నమోదు

**వంచనగిరి/ఏప్రిల్ 13 (జర్నలిస్ట్ వార్త):**
గీసుగొండ మండలం వంచనగిరి గ్రామంలో చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం జరిగిన ఈ దాడులపై గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ సోమవారం వివరాలను వెల్లడించారు.

**ప్రహరీ గోడ చిచ్చు..**

పోలీసుల కథనం ప్రకారం. వంచనగిరి గ్రామంలో ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించి రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈనెల 12న (ఆదివారం) ఇరువర్గాల వారు పరస్పరం వాగ్వాదానికి దిగి, అది కాస్తా దాడులకు దారితీసింది. ఒకరిపై ఒకరు భౌతికంగా దాడి చేసుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

**ఏడుగురిపై కేసు..**

బాధితుల ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి సోమవారం కేసు నమోదు చేశారు.
మొదటి వర్గం, బూర్గుల యుగంధర్, బూర్గుల తిరుమలరావు, బూర్గుల కవిత, బూర్గుల ఐశ్వర్యలపై కేసు నమోదైంది.
రెండో వర్గం, కౌడగాని విజయ, హింగిరిగే పద్మ, గౌడగాని నాగరాజు (సిద్ధు)లపై పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టాన్ని అతిక్రమించి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. కేసును గీసుగొండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.